# స్వర్గారోహణం

కాశీ నగరం... పౌర్ణమి రాత్రి... వెన్నెలలో గంగ మెరిసిపోతోంది. గంగానది ఒడ్డుకి దగ్గరగా వున్న త్రిపుర సుందరీ ఘాట్‌కి దగ్గరగా వున్న సత్రంలోని ఓ గది కిటికీ లోంచి వెన్నెల గదిలోకి ప్రవేశించి ఆ గదిలోని ముసలి దంపతులను చూసి చిన్నగా నవ్వుతున్నది.

భార్య భువన కలత నిద్రలో వున్నది. భర్త చంద్రుడు భార్య పక్కన కూర్చుని కళ్లజోడు సరి చేసుకుంటూ అన్నపూర్ణాష్టకం చదివి వినిపిస్తున్నాడు భార్యకి.

"భిక్షాందేహీ.... అన్న పదం వినిపించినప్పుడల్లా భువనకు ఒళ్లు గగుర్పొడుస్తున్నది.

"భువనా...?" మెల్లిగా పిల్చాడు భర్త భార్యని.

"ముసలి తనం భారంగా వుందా?" అని అడిగాడు.

"మీకు లేని భారం నాకు మటుకేనా....? నన్ను కాశీకి తీసుకు రావాలని మీకు ఇప్పటికైనా తోచిందే..... అదే నాకెంతో బలాన్నిచ్చింది... ఇప్పుడు నాలో కొత్త ఉత్తేజం ప్రవేశించింది....." అని భర్తకి మెల్లిగా జవాబు చెప్పింది భువన.

పసుపు రాసుకు స్నానం చేసిన, పచ్చగా మెరిసిపోతున్న ముఖం, నుదుట రూపాయి కాసంత కుంకం బొట్టు.... ఇంట్లో వున్నప్పుడు మెడ నిండుగా బంగారు హారాలు వేసుకునేది. కాశీలో దొంగల భయం జాస్తి అని అన్నీ తీసి బాంకు లాకర్లో పెట్టి, మెడలో వుత్త పసుపు తాడు కట్టుకుంది. ఆ పసుపు తాడే ఆమెకెంతో హుందాతనాన్ని ఇచ్చింది. లక్క రంగు బోర్డరున్న పచ్చటి రంగు పట్టుచీర ఆమె వయసుకెంతో నప్పి, ఆమె అందాన్ని రెట్టింపు చేసింది.

భువన భర్తను చూసి మెల్లిగా నవ్వింది. ఓ కాలంలో భువన నవ్వితే నోటిలో తెల్లటి దంత పక్తి తెల్లటి మల్లె మొగ్గలులా మెరిసేవి... ఇప్పుడా దంత పక్తి లేదు..... వుత్తబోసి నోరు.

"చచ్చిపోవడం అనివార్యం అయితే మనమందరం మరణించేందుకు ఎందుకు భయపడతాము? చావుని తప్పించుకోవాలనే ఆరాటం ఎందుకో...? అందరూ అన్నట్లు మనం జీవితాన్ని పరిపూర్ణంగా జీవించాము. శతాభిషేకం చేసుకునే వయసులోకి రాబోతున్నాము..... ఇంకా ఎందుకు జీవించడం.... వున్న కొడుకులు సరిగా చూడరు..... ఒకే కూతురు మనకంటే ముందే వెళ్లిపోయింది.

"ఈ వయసులో మీరు నాకంటే ముందు పోయి నేను పసుపు కుంకాలు పోగొట్టుకుని అమంగళిగా పోయేకంటే నేనే ముందుగా పోవాలని ఆ విశాలక్షిని ప్రార్థిస్తున్నాను.... ఈ కాశీలోనే వుండి ఎవరికైనా డబ్బిచ్చి మనకి భోజనం పెట్టమని ఆఖరి క్షణాల వరకూ కాశీ విశ్వనాధుని, అన్నపూర్ణను విశాలక్ష్మిని రోజూ దర్శించుకుని, పూజిస్తూ ఇక్కడే వుండిపోదాము....!" అన్న భార్య మాటలు చంద్రునికి బాధను కలిగించినాయి.

"నువ్వు నన్ను పెళ్లి చేసుకున్న నాటి నుంచీ ఇలాగే అంటున్నావు.... నువ్వు పోయాక నేను మాత్రం బ్రతికుండగలనా?

"భువనా...." వత్తి పలుకుతూ పిలిచిన చంద్రుని పిలుపులో ఆవేశం పాలు ఎక్కువగా వుంది.

"అరవై సంవత్సరాల నుంచీ నువ్వు ఇలాగే అంటున్నావు... నువ్వెళ్లిపోయాక నేనెట్లా బ్రతుకుతానన్న ఆలోచనే నీకు రాలేదా భువనా....? అసలైనా ఎవరు ముందు పోవడం అన్నది మన చేతుల్లోనా వున్నది....? నువ్వింక చావు విషయం ఎప్పుడూ మాట్లాడద్దు.... అలా మాట్లాడావంటే నాకు బాగా కోపం వస్తుంది.... నేనే ముందుగా ఈ గంగలో పడి చచ్చిపోతాను...." అని భర్త అన్న దానికి భువన చాలా భయపడింది... దుఃఖం వచ్చి కళ్లు తుడుచుకుంది.

వాతావరణం శాంతించాక, చంద్రుడు "రేపు సూర్యోదయానికి ముందే పడవ వస్తుంది. హనుమాన్ ఘాట్, మణి కర్ణికా ఘాట్, హరిశ్చంద్రా ఘాట్‌లకి పడవలో వెళ్లి స్నానాలు చేసి మన పెద్దలకు తర్పణాలు వదిలి వద్దాము.... అన్నీ పూర్తి అయ్యేసరికి తొమ్మిది గంటలవచ్చును.... అంత వరకు పచ్చి గంగైనా నోట పొయ్యకుండా వుండాలి.... అంతవరకు అలిసిపోకుండా వుండే శక్తినిమ్మని ఆ అన్నపూర్ణ తల్లిని వేడుకో....." అన్నాడు. చంద్రుడు అన్నట్లుగానే ఇంకా వెలుతురు రాకుండానే పడవ వచ్చింది.

భార్యా భర్తలిద్దరూ పడవలో ఎక్కారు....

హనుమాన్, మణికర్ణికా, హరిశ్చంద్రా ఘాట్‌ల పారంచాల దగ్గర పడవ ఆపితే, భార్యా భర్తలిద్దరూ పడవ దిగి స్నానాలు చేసి పితృ కార్యాలు చేశారు. ఇంత ముసలి తనంలో కూడా అంత శ్రద్ధా భక్తులతో పితృ కార్యాలు చెయ్యడం, చేయిస్తున్న పండాకి ఆశ్చర్యంగా వుంది.

మొత్తం అయిదు ఘాట్‌ల లోను పిండాలు పెట్టి తిరిగి వచ్చి పడవలోంచి దిగుతూంటే భువన తూలి పడపోయింది. చంద్రుడు భార్య పడి పోకుండా పట్టుకుని ఆమె తల తన భుజం మీద పెట్టుకున్నాడు.

అరవై సంవత్సరాల కిందట ఇలాగే చిదంబరం చెరువు మెట్ల మీది నుంచి ఒకరి చెయ్యి ఇంకోళ్లం పట్టుకుని ఎక్కి పైకి వచ్చాము.

ఆ తరువాత బాధ్యతలతో మునిగాం... తేలాం.... మళ్లీ ఇప్పుడిట్లా ఇవ్వాళ ఇక్కడ...." అని గొణుగుతున్నది భువన.

బస చేసిన గదిలోకి రాగానే భువనకి తల ఒళ్లు తిరగడం ఎక్కువై గోడను పట్టుకుంది.

భార్యను కూర్చోబెట్టి చంద్రుడు ఫాస్కులోంచి కాఫీ గ్లాసులోకి పోసి భార్య నోటికందిస్తే తాగలేదు భార్య.

"వద్దండీ... అన్నపూర్ణేశ్వరిని దర్శించుకొచ్చి తాగుతాను. మనం ఇంకపైన కాశీలోనే వుండిపోదామన్న దానికి మీరేం జవాబు చెప్పలేదేం....? ఆఖరి రోజులు ఈ కాశీలోనే గడుపుతూ, రోజూ గంగా స్నానం చేస్తూ పునిస్త్రీగా పోవాలన్నదే నా కోరిక....."

"ఒసే.... భువనా...." చంద్రుడు గట్టిగా కేక పెట్టాడు. "ఇలా అనద్దని నీకెన్ని సార్లు చెప్పాను.... నీవిలా అంటే నేనే వెళ్లి గంగలో పడతాను.... నువ్వు లేకుండా నేను బతికుంటాననే అనుకుంటున్నావా....?" అన్న చంద్రుడుకి కళ్లలో నీళ్లు తిరిగినాయి.

భర్త కన్నీళ్లకి భువనకి బాధ కలిగింది. తనెందుకట్లా మాట్లాడానా అని నొచ్చుకుంది.

"ఇంకెప్పుడు అనను లెండి.... బాధ పడకండి... మనం చేసే ప్రార్దనలలో ఏముందండీ.... అన్న భువన భర్త కంటి నీరు తుడవాలని చెయ్యి పైకి ఎత్తాలనే ప్రయత్నం చేసింది. చేతులు చాచలేకపోతోంది భువన. తోట కూరకాడలకు మల్లే వేళ్లాడ పడుతున్నాయి.... తల భర్త పాదాల మీదికి ఒరిగిపోయింది.

"భువనా... ఆ... ఆ....." అని చంద్రుడు పిలిచిన పిలుపు కాశీలోని అన్ని ఘాట్‌లలోనూ ప్రతిధ్వనించింది.

ధర్మవాన్ గంగాధర శాస్త్రి భువన అంత్య క్రియలు జరిపించారు.

ఆయన నాతో అన్నారు "నాయినా, పాపం....!

– ఎ. సువర్ణ



ఈముసలాయన భార్యను పోగొట్టుకుని దుఃఖించడం చూస్తే నా గుండె ద్రవిస్తోంది. ఈ కాశీలో ఎంతో మంది చచ్చిపోవడం చూస్తున్నాను.... ఈ వృద్ధ దంపతుల అన్యోన్యత నన్ను పులకింప చేసింది.

"నిన్న ఆమె నన్ను సుమంగళిగా వెళ్లి పోవడం పుణ్యం కదూ అని అడిగింది.... ఆమె అనుకున్నట్లుగానే పునిస్త్రీగా వెళ్లి పోయింది పుణ్యాత్మురాలు.

"ఇంకపైన ఈ ముసలాయన గతి ఏమిటో...!" అని శాస్త్రిగారు అన్నదానికి "వాళ్ల వాళ్లకి టెలిగ్రాం ఇమ్మంటారా....?" అని అడిగాను.

"వూళ్లో మాత్రం ఆయన్ని ఎవరు చూస్తారు...? అక్కడ ఎవరూ చూడడం లేదనే ఈ దంపతులు కాశీకి వచ్చారు.... భువనేశ్వరిగారు చాలా పట్టుదల మనిషి.. అనుకున్నది సాధించుకుని సుమంగళిగా భర్త చేతుల మీదుగా వెళ్లి పోయింది... దేముడు స్త్రీ జన పక్షపాతి ఆమె కోరుకున్నట్లే చేశాడు....."

అదే పడవలో భువన శరీరాన్ని హరిశ్చంద్ర ఘాట్‌కి తీసికెళ్లి ఒడ్డున దహనం చేసి, కాలి బూడిదైన చితిని గంగలోకి తోసి తిరిగి వచ్చారు.

గంగాధర శాస్త్రిగారు నా వద్దకొచ్చి "సార్, తమరు మద్రాసుకేగా వెడుతున్నారు.... వీరిని మీతో తీసికెళ్లి ఆయన కొడుకులకు అప్ప చెప్పండి సార్...." అని చెప్పిందాన్ని నేను కాదనలేకపోయాను.

గంగా కావేరీ ఎక్స్‌ప్రెస్‌లో పొద్దునే బయలుదేరాము.... ముసలాయన మెల్లిగా నడుస్తూ వచ్చి రైలు ఎక్కారు. ఆయనకు కింది బెర్త్ ఇచ్చాము. బండి బయలుదేరుతుండగా ఆయన వెక్కి వెక్కి ఏడిచారు.

"ఆమెను జల సమాధి చెయ్యడానికా నేనీ కాశీ తీసుకొచ్చాను... ఇంకపైన భువన లేకుండా నేనెట్లా బతగ గలను...." అని ఏడుస్తున్న ఆయన్ని చూస్తుంటే మా హృదయాలు జాలితో నిండి పోయినయ్యి.

"సుమంగళిగా వెళ్లిపోయింది. అదృష్టవంతురాలు...." అన్నది నా భార్య.

నేను వులిక్కిపడి ఆ మాట ముసలాయిన చెవిన పడిందా అని చూశాను.

కళ్లు మూసుకు పడుకుంటే వినుండరని అనుకున్నాను.

అలహాబాద్ వచ్చింది. ఓ కప్పు కాఫీ తీసుకుని ముసలాయనకిద్దామని ఆయన దగ్గరకెళ్లి లేపుదామని ఒంటి మీద చెయ్యి వేశాను...

ఇంకెక్కడి ముసలాయన..... చేతికి శరీరం చల్లగా తాకింది... ఆయనలోని హంస ఎగిరి పోయింది....!